# బహుమానం

మా వూళ్ళో హఠాత్తుగా ఎర్రెద్దు రంకె వేసింది; ఊరు వూరంతా దద్దరిల్లింది.

ప్రొద్దు మూడు బారలు ఎక్కకమునుపే ఊళ్ళోకి ప్రొక్యూర్‌మెంటు ఆఫీసరు జీపులో తన సిబ్బందితో తరలి వచ్చాడు బస్తీనుంచి. మధ్యకారు, సన్నకారు రైతులంతా హడలి పోయారు — తిండికోసం, కూలినాలి జనంకోసం దాచుకున్న గింజలను బలవంతాన లాక్కుపోతారేమోనని.

"ఆఫీసరు కొరకరాని కొయ్య!"

"ఉద్యోగధర్మాన్ని తు. చ. తప్పకుండా పాటించే మూర్ఖుడు."

"ధాన్యాన్ని లెక్క ప్రకారం వసూలుచేస్తాడు. అమ్మాయి పెళ్ళి వున్నదన్నా, బామ్మగారి పెద్దకర్మ వున్నదన్నా, తాతగారి తద్దినమున్నదన్నా — ఏమీ దయతల్చడు. మానెడు గింజలు మిగల్చడు." సన్నకారు, మధ్యకారు రైతులు ఆఫీసరున్ను గురించి అలా భయపడ్డారు.

కాని వందలకొలది బస్తాల ధాన్యం వడ్లపురులలోను, పక్కా బిల్డింగ్సులోను నిల్వచేసిన షావుకారు రవ్వంత చలించ లేదు. అన్నీవున్న విస్తరివలె నిశ్చలంగా నిర్భయంగా ఉన్నారు.

కారణం మునసబు మొదలైన గ్రామోద్యోగులు తల గుడ్డలు చుట్టుకొని చేతులు అడ్డంగా కట్టుకొని ఆఫీసరుగారి ఎదుట వినమ్రవదనులై ఆర్డర్సు కోసం నిలబడ్డారు.

"ఊళ్ళో మొత్తం ఎంత ధాన్యం వుంటుంది!" అన్నాడు ఆఫీసరుగారు ఘంటా రావంలాంటి కంఠస్వరంతో.

"ఆయకట్టు క్రింద అంతా రెండువేల ఎకరాల మాగాణి వుందండి. ఎకరానికి సగటున పుట్టిచొప్పున పంట వేసుకున్నా మొత్తం పాతికవేల బస్తాలదాకా ధాన్యం వుండాలండీ" అన్నాడు కరణం చేతులు నలుపుకుంటూ.

"ఉండాలండీ అని కాదు!" ఉన్నదా! అన్నాడు ఆఫీసరుగారు అధికార దర్పంతో.

"అంత ఎలా వుంటుంది సార్! అందులో అయిదో వంతుకూడా ఊళ్ళో లేదని నా అనుమానం. తిండి గింజలకోసం కుటుంబానికి పుట్టో రెండు పుట్లో పాతర్లలో నిల్వచేసు కుంటారు. మామూలు టైములో పనీపాటా జనానికి కూలీనాలీ కింద కొంత పోతుంది. తర్వాత జనరల్ ఎలక్షనుకుముందు అధికమైన వడ్డీ రేటుకోసం కొంతమంది రైతులు ధాన్యం అమ్మి, డబ్బుచేసుకొని నిలబడ్డ ఎం. ఎల్. ఎ. లకు డబ్బు సర ఫరా చేశారు. ఈ వేసవికాలంలో ఎలా లేదన్నా ఊళ్లో వంద

పెళ్ళిళ్లు జరిగుంటాయి. దినాలు, తద్దినాలు మిగతా కార్యాల క్రిందర ఎంత ధాన్యం నల్చుకు పోయిందో లెక్క కట్టలేము" అన్నాడు మునసబు చౌదరి నిమ్మకు నీరెత్తినేం అన్నట్టు.

"బీహారు కేరళ మొదలైన రాష్ట్రాలు తిండి గింజలు కోసం అలమటిస్తున్నాయని ఈ ఊళ్లో రైతులకు తెలియదూ? మీా వూరు రోజూ పత్రికలు రావూ? గవర్నమెంటు ధాన్య సేకరణ చేస్తూందని తెలియదూ!" మండిపడ్డారు ఆఫీసరుగారు.

మునసబు చౌదరి గంభీరంగా చిరునవ్వు నవ్వాడు.

"అన్నీ తెలుసు, కాని మనం చేసే దేముంది? రైతుకు చేతికి పంటవచ్చే టైములో జనరల్ ఎలక్షన్లు వచ్చాయి. అప్పుడు ప్రొక్యూరుమెంటు జరగలేదు. రైతులు నిర్భయంగా అధిక ధరలకు ధాన్యాన్ని అమ్ముకున్నారు. ఏ గవర్నమెంటు ఆఫీసరూ వాళ్లని నిరోధించలేదు. ఇప్పుడు చేతులు కాలాక, ఆకులు పట్టుకుంటేమాత్రం ప్రయోజనమేముంది?"

మునసబు వేదాంతం ఆఫీసరుకు బోధపడలేదు. వినుక్కున్నాడు. "ధూంధాం" అన్నాడు. రైతులఇళ్లమీాదకు దాడి ప్రారంభించాడు సిబ్బందితో.

ముందుగా కచేరీ చావడికి దగ్గర్లోవున్న నరసయ్య గారింటికి వెళ్లారు.

ఆయన ఇంటిముందు మెరాబాలోవున్న పట్లపురి ఆఫీసరుగారి కంటబడింది. ఆయన ఓ మధ్యకారు రైతు, ఆయన కెన్ని ఎకరాల పొలముందో, అంతమంది పిల్లలున్నారు.

"ఈ వడ్లపురిలో ఎంత ధాన్యముంది ?"

"వంద బస్తాలు."

"నీకు పొలమెంత వుంది ?"

"పదెకరాలు"

"నువ్వు గవర్నమెంటు వారికి ఎకరానికి సగంబస్తాల చొప్పున ఇవ్వాల్సిన విధివున్నది. ఈ పురి పగలగొట్టి డెబ్బై బస్తాలివ్వు — కంట్రోల్ రేటుకు."

నరసయ్య ఆఫీసరుగారి కాళ్ళమీద పడ్డాడు. "ఈ యేడు ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయాలి. మొత్తం పద్నాలుగు మంది గల కుటుంబం. సొంత సేద్యం, పనిపాటలవాళ్ళకు ధాన్యమే సర్దుబాటు చేయాలి. ఉన్న ధాన్యమంతా మీరు తీసుకుపోతే నేనూ, నా పిల్లలూ ఏంకావాలి బాబూ! గడ్డను నమ్ముకొని బ్రతికేవాణ్ణి! పిల్లలకు చిప్పలు పంచిపెట్టేవా!

"నా డ్యూటీ నేను నిర్వర్తిస్తున్నాను. నీ తిప్పలు నీవి. పురి పగలగొట్టండి" అన్నాడు ఆఫీసరు అధికారస్వరంతో వెట్టి వాళ్ళకేసిచూసి.

ఆవిధంగా ఆఫీసరుగారు అధికారహోదాతో, దర్పంతో, దౌర్జన్యంతో, విధినిర్వహణతో, సన్నకారు, మధ్యకారు రైతులవద్ద అయిదు బస్తాలనుంచి వంతబస్తాలవరకు పగలు పన్నెండు గంటలలోపు దాదాపు వెయ్యి బస్తాల ధాన్యం నిర్దయగా, కఠినంగా, నిర్విచ్చగా వసూలుచేశారు.

ప్రొద్దు నడినెత్తిమీదికి వచ్చింది. ఆఫీసరుగారు అలసి పోయారు. ఆఫీసరుగారి కడుపులోని ఆకలి "పంచభక్ష్య పర మాన్న భోజనం" కోసం ఒత్తిడి పెట్టుతుంది. అంతలోనే మా వూరు షావుకారు శివరామయ్యగారి ఇంటినుంచి కబురొచ్చింది, "భోజనం రెడీ" అని. జీప్‌లో ఆఫీసరుగారు, ఆయన సిబ్బంది అప్పారావుతో సహా షావుకారు గారింటికి వెళ్ళారు.

షావుకారు శివరామయ్యగారు ఆఫీసరుగారి గౌరవార్థం ఓ చిన్న సైజు లంచ్ ఏర్పాటు చేశారు. ఆ భోజనానికి ఊళ్లో ఉన్న పదిమంది షావుకార్లను ఆహ్వానించారు. అందరినీ ఆఫీసరుగారికి పరిచయం చేశాడు. కోడి పలావు, కోడి రోస్టు, కోడిగ్రుడ్డు, రొయ్యల వేపుడు, చేపపులుసు మొదలైన పదార్థాలతో అందరు కులాసాగా, ఆకలితీరా కడుపులు పగిలేట్టు సంతృప్తికరంగా భోజనం చేశారు. ఆపైన ఆఫీసరుగారు గదిలో ఏ.సి. ఫ్యాన్ క్రింద విశ్రాంతి తీసుకుంటుండగా షావుకారు శివరామయ్యగారు, మరి ఇరువురు షావుకార్లు ఏకాంతంగా ఆయనను కలుసుకున్నారు.

"మా వూళ్ళో పదిమందిమి ఉన్నాం, షావుకార్ల క్రింద చెలామణీ అవుతూన్నవాళ్ళం. మీలాంటి సహృదయుల ఎదుట నిజం దాచడం భావ్యంకాదు. మా అందరి దగ్గర మొత్తం రెండువేల బస్తాల ధాన్యం నిల్వవుంది. గవర్నమెంటు వారి రేటుకు మార్కెటు రేటుకు ఒక్కొక్క బస్తాకు పదిహేను రూపాయల వ్యత్యాసం వున్నమాట వాస్తవమే! అది అంద

రికీ తెలిసిందే! ఏదో బహుమానం రూపేణా మిమ్మల్ని సత్క-రించి, సంతృప్తి పరచవలసిన కర్తవ్యం మాపై వున్నది. మేము మామూలు రైతులవలె మూర్ఖులంకాము. ఇచ్చిపుచ్చు కొనే వ్యాపారం తెలిసినవాళ్ళం గనుక, బస్తాకు అయిదు రూపాయల చొప్పున పదివేల రూపాయలు తమకు బహుమానం ఇవ్వ నిశ్చయించుకున్నాం. ఇదిగో తీసికొండి అప్పైకం" అంటూ శివరామయ్యగారు లెదర్ బ్యాగ్‌తో సహా ఆ పారితోషికాన్ని ఆఫీసరు గారికి సమర్పించాడు.

చిరునవ్వు నవ్వుతూ ఆ డబ్బును అందుకొని, బ్యాగ్ తెరచిచూచి సంతృప్తిపడి "అయితే వెళ్ళొస్తాం" అంటూ లేచారు ఆఫీసరుగారు.

షావుకారు శివరామయ్యగారి ఇంటివద్దనుంచి బయలు దేరిన జీపు నేరుగా బస్తీ రోడెక్కడం ఊళ్ళో నన్నకారు, మధ్యకారు రైతులకు విపరీతమైన ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎందుకంటే ఆఫీసరుగారు భోజనానంతరం షావుకార్ల ధాన్యపు గిడ్డంగులపై దాడి చేస్తారని వాళ్ళు నమ్మారు!

—: * :—